సాక్షి తిరుపతి
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



ఎస్వీయూలో నీలిట్ ఏర్పాటు

శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో నీలిట్ సంస్థ ఏర్పాటుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. - 8లో



దుకాణం దగ్ధం

చంద్రగిరిలో గురువారం అర్ధరాత్రి పూజా సామగ్రి దుకాణం అగ్నికి ఆహుతైంది. రూ.1.30లక్షల నష్టం వాటిల్లింది. - 8లో



బస్సులు సిద్ధం చేయండి

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వందశాతం కండిషన్ ఉన్న బస్సులను సిద్ధం చేయాలని ఈడీ చెంగల్ రెడ్డి సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

ఏపీటీఎఫ్ జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్ 1938) ఆధ్వర్యంలో జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నారు. ఏపీటీఎఫ్ 80 ఏళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్, ఎస్.సురేష్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యావ్యవస్థలో సంస్కరణలు-ప్రాథమిక విద్యపై చూపుతున్న ప్రభావాలు, సుదీర్ఘ ప్రస్థానంలో ఉపాధ్యాయ ఉద్యమం-ఉపాధ్యాయుల పాత్ర, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ కృషి అనే అంశాలపై చర్చించడంతోపాటు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా విద్యాశాఖాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ఏపీటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, మేధావులు హాజరై ఈ సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మహిళా వర్సిటీలో ఘనంగా ఫుడ్ అండ్ హెల్త్ మేళా



ఫుడ్ అండ్ హెల్త్ మేళాలో తాము తయారు చేసిన పదార్థాలతో విద్యార్థినులు

తిరుపతి సిటీ: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పద్మావతి మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఫుడ్ అండ్ హెల్త్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించారు. ఇందులో ప్రధానంగా రాగి, మునగాకు పిట్టు, అరటి పువ్వువడ, నాన్ వెజ్ పచ్చళ్లు, ఆకు కూర పొడులు, పండ్ల రసాలు సందర్శకులను ఆకర్షించాయి. ఫుడ్ స్టాళ్లతోపాటు న్యూట్రిషనల్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీసీ ఉమా, రిజిస్ట్రార్ రజని, డీన్లు ప్రొఫెసర్ వాణి, ప్రొఫెసర్ సుజాతమ్మ, డాక్టర్ బిందు, ప్రొఫెసర్ ఏం అరుణ, విజయ్‌జ్యోతి, డాక్టర్ శిరీష, ఎమ్మెస్సీ హోమ్ సైన్స్, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ, బి వొకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 68,835 మంది స్వామివారిని దర్శించుకోగా 25,883 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరు.

సిలబస్ సకాలంలో పూర్తి చేయండి



దివ్యాంగులతో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పాకాల: ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డీఈఓ శేఖర్ తెలిపారు. శుక్రవారం డీఈఓ దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇంటి వద్దే పునశ్చరణ చేసుకుని వచ్చి, విద్యార్థులకు పాఠం చెప్పాలన్నారు. విద్యార్థులు సైన్స్‌లో ప్రాజెక్ట్ వర్క్‌లు సరిగ్గా చేయలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం డీఈఓ శేఖర్ సందర్శించారు. పిల్లలతో ముచ్చటించి వారికి అన్ని సౌకర్యాలు ఉన్నాయా ? లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గతంలో భవిత కేంద్రలోని విద్యార్థులకు 5 ట్యాబ్‌లను అందజేశారు. ఎస్ఎస్ఏ అధికారి మధుసూదన్, ఎంఈఓ బాబ్జి, హెచ్ఎం నాగరాజ పాల్గొన్నారు.

అక్రమం ఇష్టారాజ్యంగా మారింది. మట్టి రవాణానే అక్రమార్కులకు వరంగా మారింది. మన్నే బంగారంగా మారదంతో కొందరు స్వార్థ పరులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. చెరువులనే ఆవాసాలుగా చేసుకుని రేయింబవళ్లు తేడా లేకుండా యథేచ్ఛగా మట్టి తరలిస్తూ అక్రమార్జన చేస్తున్నారు. చెరువులను చెరబడుతున్నారు. తెలుగుతమ్ముళ్ల అక్రమ మట్టి తవ్వకాలపై ప్రత్యేక కథనం.

మట్టినీ బొక్కేస్తున్నారు..!



- చెరువులను చెరబడుతున్న అక్రమార్కులు
- రాత్రి పగలూ తేడా లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- అనుమతులు లేకుండా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు
- ఎమ్మెల్యే తండ్రి నెలవల కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు



సూళ్లూరుపేట మండలం మంగళంపాడు చెరువులో మట్టి తవ్వుతున్న హిటాచీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సూళ్లూరుపేట నియోజకవర్గంలో చెరువులను కుళ్ల బొడిచేస్తున్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వి, అక్రమంగా తరలిస్తున్నారు. ప్రస్తుతం యూనిట్ మట్టి సుమారు రూ.1500 పలకడంతో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తండ్రి నెలవల సుబ్రమణ్యం కనుసన్నల్లో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మట్టి కావాలనుకుంటే.. ఆయనకు కప్పం కడితే చాలు.. ఏ చెరువు నుంచైనా ఇరిగేషన్ అధికారులకు సంబంధం లేకుండా మట్టి తరలించుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి శ్రీకాళహస్తి, తిరుపతి వరకు మట్టి తరలిస్తున్నారు. రియల్ ఎస్టేట్స్ ప్లాట్లు, కంపెనీలకు అక్రమంగా మట్టి తరలిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని చెరువులు అక్రమార్కులు చెరలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన రైతులు ఎవరైనా అడిగితే అధికారం బలంతో వారి నోళ్లు నొక్కేస్తున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఎన్నికల్లో సుమారు రూ.15 కోట్లు ఖర్చు పెట్టిందని, ఇందుకోసం పొలాలు, కల్యాణమండపం అమ్ముకున్నామని, ఇప్పుడు సంపాదించుకోకపోతే ఎలా? అని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో పోగొట్టుకున్న ఆస్తిని మళ్లీ సంపాదించుకోవాలంటే ఇలాంటివి తప్పవని సమాధానం ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లే బాహాటంగా అంటున్నారు.

తవ్వకాలు ఈ చెరువుల్లోనే..

- తడ మండలం గ్రద్దగుంట చెరువును గనుల తరహాల్లో తవ్వేశారు. ప్రస్తుతం ఖాసింఖాన్ కండ్రిగ చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ చెరువుల్లో టీడీపీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్ పేరు చెప్పి ఆయన కారు డ్రైవర్, ఆయన అనుచరుడు కాదలూరుకు చెందిన వ్యక్తి మట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ రెండు చెరువుల నుంచి సుమారు రూ.కోటి పైగా మట్టి తరలించేశారు.
- ఇలుపూరు చెరువు కట్టను తెగ్గొట్టి మరీ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ అయిదు వేలు క్యూబిక్ మీటర్లు మట్టి తీయడానికి ఎన్నికలకు ముందు అనుమతినిచ్చారు. అప్పుడు ఎన్నికల కోడ్ వచ్చేసిందని ఆపేసి ఆ పర్మిషన్‌ను శ్రీసిటీ ప్రతినిధి ముకుందరెడ్డి పేరు మీద ఇచ్చారు. వారికి కేవలం ఒక హిటాచ్చి నాలుగు ట్రిప్పర్లుకు మాత్రమే అనుమతి ఇవ్వగా రెండు హిటాచిలు పెట్టి సుమారు 25 ట్రిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఎక్కడెక్కడో రియల్ ఎస్టేట్ వెంచర్లుకు మట్టి తరలించారు.
- సూళ్లూరుపేట మండలంలో మంగళంపాడు చెరువులో రెండు హిటాచిలు, సుమారు 25 టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 402 మైనర్, మేజర్ ఇరిగేషన్ చెరువులున్నాయి. దాదాపు అన్ని చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.
- పెళ్లకూరు మండలం చెన్నమ నాయుడుపేట, నందిమాల, రోసనూరు, పునబాక, మోదుగుల పాళెం గ్రామాలకు చెందిన చెరువుల్లో మట్టి, గ్రావెల్ ఇబ్బడి ముబ్బడిగా తరలిస్తున్నారు. ఈ చెరువుల నుంచి 71వ జాతీయ రహదారి పనుల పేరుతో నాయుడుపేట పట్టణంలో వెంచర్లకు తరలిస్తున్నారు.



పెళ్లకూరు మండలం రోసనూరు చెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీ

- మంగళంపాడు చెరువు 5 వేలు క్యూబిక్ మీటర్లు వరకు తవ్వకోవడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతులిచ్చారు. ఒక హిటాచి 5 టిప్పర్లుకు మాత్రమే అనుమతులు ఉండగా రెండు పెద్ద హిటాచిలు సుమారు 30 టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ రెండు టిప్పర్లను ఆపగా.. తమకు అనుమతులున్నాయని చెప్పారు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా వారు మట్టి తరలిస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయారు.



ఓజిలి మండలం ఓజిలి పెద్ద చెరువులో మట్టి తీస్తున్న హిటాచీ

- ఓజిలి మండలంలోని చుట్టుగుంట చెరువు, ఓజిలి పెద్ద చెరువు నుంచి మట్టి తవ్వి, తరలిస్తున్నారు. అయితే ఇందులో చుట్టుగుంట చెరువు నుంచి సాగరమాల రోడ్డు పేరుతో పక్కకు కూడా మళ్లిస్తున్నారు. ఓజిలి పెద్ద చెరువులో ఇటుకల బట్టీలకు మట్టి తరలిస్తున్నారు.
- నాయుడుపేట మండలం మేనకూరు, పుదూరు, భీమవరం, పూడేరు, అరవ పెరిమిడి చెరువుల నుంచి మట్టి తవ్వి తరలిస్తున్నారు. ఇందులో భీమవరం గ్రామం ఇన్‌చార్జి సుబ్రమణం స్వగ్రామం కావడం విశేషం.



నాయుడుపేట మండలం అరవ పెరిమిడి చెరువులో గ్రావెల్ తవ్వకాలు

ప్రసాదంపై దుష్ప్రచారమా?



శ్రీవారి నైవేద్యం..మధురాతి మధురం.. అత్యంత రుచికరం.. కొంచమైనా చాలనే భక్తిభావం.. వెంకన్న లడ్డూ ఒకటి దొరికినా ఇంటిల్లిపాది అమృతంతో సమానంగా భావించి..భక్తి భావంతో స్వీకరిస్తారు. అలాంటి తిరుమల లడ్డూకు విశ్వవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. పరమ పవిత్రంగా భావించే కలియుగ వైకుంఠవాసుడి ప్రసాదమైన లడ్డూకు కూడా రాజకీయ రంగులద్ది, దుష్ప్రచారం చేయడం తగదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. అవి వారి మాటల్లోనే..

-తిరుపతి సిటీ/తిరుపతి కల్చరల్

గాలి మాటలు నమ్మే పరిస్థితి లేదు



శ్రీవారి ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉందని సాక్షాత్తు సీఎం మాట్లాడటం విడ్డూరంగా ఉంది. భక్తులను తిరుమలకు రాకుండా నిరోధించే ప్రయత్నమా? లేక శ్రీవారి ప్రసాదంపై కావాలని తప్పుడు ప్రచారం చేసే కుట్రనా? అనే విషయం అర్థం కావడం లేదు. కానీ చంద్రబాబు ఎన్ని ప్రగల్భాలు, అపద్దాలు చెప్పినా భక్తులు నమ్మే పరిస్థితి లేదు. ఆయన విషయం సూపర్ సిక్స్‌తోనే ప్రజలకు బాగా అర్థమైంది. ఆయన ఇప్పటికైనా మారాలి.

-శ్రీరాములు, తిరుపతి

వరద ప్రభావం మరచిపోయేందుకే కుట్ర



విజయవాడ వరద బాధితుల కష్టాలు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలు మరచిపోవాలనే ఆలోచనతో అధికార పార్టీ పన్నిన పన్నాగంగా అర్థమవుతోంది. ప్రజలను వెర్రివాళ్లను చేసే క్రమంలో ఇలాంటి మాటలు మాట్లాడుతుంటారు. భక్తులు దేవుని ప్రసాదంపై పెద్దగా ఆసక్తి చూపకూడదనే కుట్ర కోణం ఉందా? అనే విషయాన్ని ఆలోచించాల్సిన అవసరం ఉంది. కర్ణాటకలో సైతం గతంలో ఇలాంటి సంఘటలను రాజకీయాల కోసం వాడుకున్నారు.

-ప్రభాకర్, కోలార్, కర్ణాటక

అసత్య ప్రచారాలా?



తిరుమల పవిత్ర ప్రసాదం లడ్డూ అని నమ్ముతాం. అందులోనూ ఏవో కలిశాయంటూ కొందరు పనిగట్టుని ప్రచారం చేయడం సహించలేకపోతున్నాం. రాజకీయాలకు దేవుడితోపాటు ప్రసాదాన్ని సైతం ఉపయోగించుకోవడం సిగ్గుగా ఉంది. బాబు కుటిల రాజకీయాలకు ఇది నిదర్శనం. ఇంత దారుణంగా బాబు ప్రవర్తిస్తారని అనుకో లేదు.

-రుక్మిణమ్మ,భక్తురాలు, తిరుపతి


ఇంకేమీ దొరకలేదా?



అధికారం చేపట్టిన తర్వాత శ్రీవారి ప్రసాదంపై నిందలు వేయడం దారుణం. భక్తులు శ్రీవారి దర్శనం తర్వాత అంత ప్రాధాన్యత నిచ్చేది ఒక తిరుమల లడ్డూకు మాత్రమే. దైవ ప్రసాదంపై రాజకీయ క్రీడలు ఆడటం దేవునితో చెలగాటమాడడమే. వెంకన్న పవర్ కొందరి తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. కాలమే సమాధానం చెబుతుంది.

-సుభాషిణి, పూందమల్లై, చెన్నై

తిరుమలను రాజకీయం చేయకండి



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రాన్ని రాజకీయ క్షే త్రంగా మార్చవద్దు. సాక్షాత్తు రాష్ట్ర సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంలో ఆవు, చేపల కొవ్వుతో తయారైన నూనెను ఉపయోగిస్తున్నారని చెప్పడం బాధాకరం. తిరుమల క్షేత్రానికి ఉన్న ప్రతిష్ఠ తగ్గే ప్రమాదం ఉంది.

- మహ్మద్ గౌస్, యూ సుబ్రమణ్యం, ఏ కాంతారావు, గోపి ప్రసాద్, శరవణ, జయకుమార్, ఎమ్మెల్యే మాజీ ఇండిపెండెంట్ అభ్యర్థులు

మహిళా వర్సిటీలో ప్రీ రిపబ్లిక్ డే సెలక్షన్లు



మాట్లాడుతున్న స్టేట్ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ సంజయ్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రీ రిపబ్లిక్‌డే సెలక్షన్లు నిర్వహించారు. ఈ సెలక్షన్లకు స్టేట్ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎమ్ రామకృష్ణ సంజయ్ హాజరై మాట్లాడుతూ రిపబ్లిక్ డే పెరేడ్‌కు వెళ్లడం సువర్ణావకాశమని, విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సుమారు 58 మంది ఈ ఎంపికలో పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గాంధీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యావతి, ప్రోగ్రామ్ అధికారులు యువశ్రీ, వజీహాభాను, స్వాతి, గాయత్రి పాల్గొన్నారు.

సమన్వయంతో జాతర విజయవంతం చేద్దాం

- వెంకటగిరి జాతర రాష్ట్ర పండుగ
- బాధ్యతగా విధులు నిర్వర్తించాలి
- జేసీ శుభం బన్సల్



సమావేశంలో పాల్గొన్న జేసీ శుభం బన్సల్, అధికారులు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగ అని, అందరి అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దామని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. పట్టణంలోని పింజిల వీరయ్య కల్యాణ మండపంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శుభం బన్సాల్ మాట్లాడుతూ ఎవరెవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే జాతర విజయవంతం అవుతుందన్నారు. చివరి నిమిషాల్లో ఆ పనులకు పర్మిషన్‌లు లేవంటూ చెప్పొద్దని, ఏదైనా ఉంటే వెంటనే సబ్‌కలెక్టర్‌కు వివరించాలన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ సామాన్య భక్తులకు కూడా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీన మాట్లాడుతూ జాతర నిర్వహణలో దేవాదాయ, పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్, ఆర్ అండ్‌బీ, విద్య, వైద్య, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి జాతర జయప్రదం చేయాలన్నారు. గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ మాట్లాడుతూ జాతర బందోబస్తుకు 1200 మంది పోలీసులను నియమించి 8 క్లస్టర్‌లుగా విభజిస్తామన్నారు. తిరుపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ మాట్లాడుతూ జాతరలో పూర్తిగా మద్యపాన నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 25, 26వ తేదీల్లో వెంకటగిరి పట్టణం సమీపంలో బ్రాందీషాపులన్నీ 48 గంటల పాటు మూసివేస్తామన్నారు. అలాగే ప్రత్యేక టీమ్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేసి అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వెంకటగిరి డిపో మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి డిపో నుంచి 70 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని ప్రస్తుతం 80 ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్యశిబిరాల ఏర్పాటుతోపాటు 6 అత్యవసర అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచనున్నట్లు వైద్యశాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహర్‌చారి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, ఎంపీపీ తనూజారెడ్డి, దేవదాయశాఖ ఈఓ శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌షరీద్, సీఐ ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న వీకేసరస్వత్

ఏర్పేడు: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని నీతి అయోగ్ సభ్యుడు వీకే సరస్వత్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐఐటీ ప్రాంగణంలో సుస్థిర ఆర్థికవృద్ధికి కొత్త యుగం సాంకేతికత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముందుగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఐఐటీ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నీతి అయోగ్ సభ్యుడు మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తును రూపొందించడంలో ఆవిష్కరణలు, పరిశోధనల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. రక్షణ సాంకేతికతపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సైన్స్ టెక్నాలజీ, ఇన్నోవేషన్‌పై నీతి అయోగ్ చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

ఐటీ ఉద్యోగాలపై అవగాహన

తిరుపతి సిటీ : స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉచిత కెరీర్ గైడెన్స్ సెమినార్ నిర్వహించారు. జగతి నెట్‌వర్క్ ఇండియా హెచ్‌ఆర్ సొల్యూ షన్స్, గో ఆన్‌లూన్ ట్రైనింగ్స్ సహకారంతో ఐటీ రంగంలో అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. సదస్సులో మోహన్, రవికుమార్ బైపల్లి, భరత్ కృష్ణ, రమేష్ జోగి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్, రైటర్, నాగరాజు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పూజా సామగ్రి దుకాణం దగ్ధం

చంద్రగిరి: పూజా సామగ్రి దుకాణం అగ్నికి ఆహుతైన ఘటన గురువారం అర్ధరాత్రి చంద్రగిరి నాగాలమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. చంద్రగిరి పాతపేట దిగువవీధికి చెందిన మునికృష్ణారెడ్డి మూడు నెలల నుంచి పూజా సామగ్రి, కూల్ డ్రింక్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి వ్యాపారం ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దుకాణంలో మంటలు వస్తున్నాయంటూ వాచ్‌మన్ ఫోన్ చేసి చెప్పడంతో పరుగున దుకాణం వద్దకు చేరుకున్నాడు. అప్పటికే దుకాణం దగ్ధం కావడంతో బాధితుడు బోరున విలపించాడు. గురువారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలను నాగాలమ్మ ఆలయం మీదుగా నిర్వహించారు. ఈ క్రమంలో ఉద్దేశపూర్వకంగా తన దుకాణంలో ఆకతాయిలు నిప్పు వేసినట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. సుమారు రూ.1.30లక్షల విలువైన సామగ్రితో పాటు రెండు ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అలిగి వెళ్లిన బాలికల అప్పగింత

తిరుపతి క్రైమ్: నగరంలోని జీవకోనలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికలు పారిపోగా.. వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు.. తల్లిదండ్రులు మందలించడంతో పిల్లలు గురువారం ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయారు. వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామన్నారు. బాలికలను పార్వతీపురంలో పట్టుకున్నామని తెలిపారు.

నకిలీ మందులతో నష్టపోయా



ఈ చిత్రంలో రైతు.. పలగాటి శ్రీనివాసులురెడ్డి. ఈయనది కొక్కుపాడు గ్రామం. ఈయన మూడు రొయ్యల గుంతలు సాగు చేశారు. 30 కౌంట్ వరకు కాపాడుకుంటూ వచ్చారు. మరో రెండు రోజుల్లో రొయ్యలు పట్టుకుంటే అప్పుల బాధలు తీరుతాయని భావించారు. ఇంతలో ఓ వైరస్ సోకడంతో జూక్లియర్ అనే మందు వాడాలని ఓ షాపు యజమాని సూచించడంతో అదే మందును అప్పు చేసి మరి కొనుగోలు చేసి రొయ్యల చెరువుల్లో వాడారు. దీంతో గుంతల్లోనే రొయ్యలు చనిపోయాయి. సుమారు ఆరు టన్నుల రొయ్యలు చనిపోవడంతో సుమారు రూ.12 లక్షలు నష్టపోయారు. నకిలీ మందుల బెడద నుంచి ఆక్వా రైతును కాపాడాలని ఆయన కోరుతున్నారు.

-పలగాటి శ్రీనివాసులురెడ్డి,కొక్కుపాడు, కోట మండలం

నాశిరకం సీడ్‌తో వివిధ సైజుల్లో పెరిగిన రొయ్యలు



అయ్యో..రొయ్యో..



రొయ్య దిగుబడి బాగా రావాలంటే ? విత్తనంలో నాణ్యత అనివార్యం..కానీ నాసిరకం సీడ్, ఫీడ్ ఆక్వారైతు బతుకులో నిప్పులు చిమ్ముతోంది! కష్టాలు.. నష్టాలు మిగిలి.. అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తోంది. గత కొంత కాలంగా తిరుపతి జిల్లాలో నకిలీ రొయ్య విత్తనం, మేత విక్రయాల జోరుతో ఆక్వారైతులు రూ.కోట్ల విలువ చేసే దిగుబడులు కోల్పోతున్నారు. నకిలీ విక్రేతలపై చర్యలు తీసుకోవాల్సిన ఎంపెడా, ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ సంస్థలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా ఆక్వాసాగు ప్రశ్నార్థకంగా మారుతోంది.



- పుట్టుకొస్తున్న నకిలీ సీడ్ ఫీడ్ మందులు
- కొన్ని రోజులకే చనిపోతున్న రొయ్య పిల్లలు
- వరుస నష్టాలతో ప్రశ్నార్థకంగా మారుతున్న ఆక్వాసాగు
- నకిలీలపై తూతూ మంత్రంగా తనిఖీలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మత్స్యశాఖ



నాసిరకం ఫీడ్‌తో చనిపోయిన రొయ్యలు



దాడులు జరిపి సీజ్ చేసిన మందులను చూపుతున్న అధికారులు(ఫైల్)

వాకాడు: ఒకప్పుడు ఆక్వా రంగం డాలర్లు పండించింది. నేడు నకిలీ సీడ్, ఫీడ్ చేతిలో చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. డబ్బును సులువుగా సంపాదించాలన్న అత్యాశతో కొందరు వ్యాపారులు కృత్రిమ పద్ధతిలో రొయ్య పిల్లల ఉత్పత్తిని చేసి, నాణ్యత లేని రొయ్య పిల్లలను రైతులకు అంటగడుతున్నారు. దీనికితోడు అనుమతులు లేని రొయ్యల మేతను మార్కెట్లో జోరుగా విక్రయిస్తున్నారు. దీంతో రొయ్యలను చెరువుల్లో వదిలిన కొన్ని రోజులకే సగానికి పైగా పిల్లలు చనిపోతున్నాయి. మిగిలిన పిల్లలు వైరస్‌లతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు రైతులు కొన్ని అనుమతులు లేని నకిలీ ఫీడ్ తెచ్చి చెరువుల్లో వేయడంతో ఫలితం లేకపోగా తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రాను రాను ఆక్వా సాగుపై రైతులకు ఆసక్తి తగ్గిపోతుంది.

నాడు డాలర్ల పంట.. టైగర్ రొయ్యసాగు

ఆక్వా సాగు మొట్టమొదట 1990లో వాకాడు మండలం వాలమేడు గ్రామంలో పుట్టింది. ఎంఏఎఫ్ఎల్ కంపెనీ వారు ఉప్పునీటి ఆధారంగా 850 ఎకరాల్లో టైగర్ రొయ్యల సాగును ప్రారంభించారు. అది పదేళ్ల పాటు రైతులకు మంచి లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో ప్రతి ఒక్కరూ టైగర్ రొయ్యల సాగును చేపట్టేందుకు ముందుకు వచ్చారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి, సాగులోకొచ్చి రూ.కోట్లు కళ్లజూశారు. అయితే రాను రాను నకిలీల దెబ్బకు టైగర్ రొయ్యల సాగు కనుమరుగైంది. ఆ తరువాత కొత్తగా వచ్చిన స్కాంబీ, వెనమీ రొయ్యల సాగు దశాబ్దం పాటు రైతులను కోటీశ్వర్లును చేసింది. గత ఏడేళ్లుగా సాగులో నకిలీల బెడద ఎక్కువగా కావడంతో సాగు విస్తీర్ణం తగ్గుతోంది.

5 వేల ఎకరాలకే పరిమితం

తిరుపతి జిల్లాలో సముద్ర తీరం వెంబడి గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ మండలాల పరిధిలో ఒకప్పుడు 87 వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండేది. ప్రస్తుతం ఆ సాగు 5 వేల ఎక్టార్లు మాత్రమే పరిమితం అయ్యింది.

నకిలీ ఫీడ్‌తో నష్టాలు

కొందరు వ్యాపారులు కంపెనీలు ఇచ్చే కమీషన్లుకు కక్కుర్తిపడి రైతులకు నాసిరకం ఫీడ్, మందులను అంటగడుతున్నారు. ఎమ్మార్పీల్లో 50 శాతం కమీషన్లు ఇస్తుండడంతో ఇవి నాసిరకం మందులు అని తెలిసినా గుట్టు చప్పుడు కాకుండా రైతులకు అంటగడుతున్నారు. అయినా ప్రభుత్వాధికారులతోపాటు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ, ఎంపెడా తదితర సంస్థలు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాయి. అధికారులు మామూళ్లకు అలవాటుపడి నోరు మెదపడంలేదు.

హేచరీ యజమానుల అత్యాశే రైతులకు శాపం

జిల్లాలో 21 రొయ్యి పిల్లల హేచరీలున్నాయి. తద్వారా నాణ్యమైన రొయ్య పిల్లల ఉత్పత్తికి కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ కొన్ని మార్గ దర్శకాలను రూపొందించింది. అనుమతి పొందిన హెచరీలకు మాత్రమే బ్రోడర్స్(తల్లి రొయ్య)లను ఎంపెడా సరఫరా చేస్తోంది. ఈ తల్లి రొయ్య ద్వారా ఒక దఫాలో 1 మిలియన్ సీడ్ ఉత్పత్తి అవుతుంది. ఒక బ్రోడర్‌తో 3, 4 సార్లు కన్నా ఎక్కువ సార్లు గుడ్లు పెట్టించ కూడదు. అలా ఉత్పత్తి చేసిన రొయ్య పిల్లలు చెరువుల్లో దాదాపు 75 నుంచి 85 శాతం వరకు సక్సెస్ అవుతాయి. మంచి దిగుబడులు కూడా వస్తాయి. అలా కాకుండా ఒక్క తల్లి రొయ్యి(బ్రోడర్) ద్వారా 5 నుంచి 8 సార్లు పిల్లలను పెట్టించడంతో రొయ్యి పిల్లలు బలహీనంగా ఉండి రైతులకు భారీగా నష్టం వాటిల్లుతుంది. కొన్ని హేచరీలు తొలి కాన్పులో పెట్టించిన పిల్లలు, అలాగే 7, 8 కాన్పుల్లో పెట్టించిన పిల్లలను కలిపి రైతులకు అంటగడుతున్నాయి. ఇలా చేయడంతో అవి చెరువుల్లో ఎదుగుదల తగ్గిపోతున్నాయి. ఒకవేళ పెరుగుదల ఉన్నా అవి వివిధ సైజుల్లో ఉండడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లా హేచరీలపై నమ్మకం లేని రొయ్యి రైతులు పాండిచ్చేరి నుంచి సీడ్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

గత కొన్ని నెలలుగా ఆక్వా సాగులో నకిలీలు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో సాగు రాను రాను ప్రశ్నార్థకంగా మారుతోంది. ఆక్వా రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. నేడు జిల్లాలో కొన్ని ఆక్వా ఫీడ్ షాపుల యజమానులు కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు కావడంతో అనుమతులు లేని మందులతో విక్రయిస్తున్నారు. దీంతో చేతి కొచ్చే దశలో సైతం రొయ్యలు చనిపోతున్నాయి. వెరసి.. కష్టాలు..నష్టాలు.. అప్పులే మిగులుతున్నాయి. ఫలితంగా దిక్కుతోచని స్థితిలో ఆక్వా రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

గత ప్రభుత్వం ఆక్వా రైతుకు వెన్నుదన్ను

గత ప్రభుత్వం ఆక్వా రైతులకు వెన్నుదన్నుగా నిలవడంతో రైతులు లాభాలతో నిలదొక్కుకున్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి జిల్లాలో ఆక్వా సీడ్ నాణ్యతను పరిశీలించేందుకు టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. అలాగే రైతుకు గిట్టుబాటు ధరల కల్పన, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి పర్యవేక్షణ బాధ్యత ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ తీసుకుంది. నకిలీలపై నిత్యం దాడులు చేసి, సాగులో అవసరమైన సూచనలు, సలహాలు రైతులకు ఇచ్చేందుకు ప్రత్యేక అధికార యంత్రాంగాన్ని నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాని నేటి ప్రభుత్వం ఆక్వా రంగాన్ని గాలికొదిలేసింది. ఫలితంగా ఆక్వా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

నకిలీ సీడ్‌తో ఎదుగుదల తగ్గిపోతుంది



నకిలీ రొయ్యి పిల్లలు చెరువుల్లో పోసిన రెండు రోజుల్లోనే అధిక శాతం చనిపోతున్నాయి. బతికిన పిల్లలు ఎదుగుదల తగ్గిపోతుంది. వాటిని కాపాడుకుందామంటే అనుమతులు లేని ఫీడ్ అంటగడుతున్నారు. కనీసం 30 శాతం పిల్లలు కూడా బతకడంలేదు. ఆక్వా రైతులు అధిక పెట్టుబడులు వెచ్చించినా ఆశించిన ఫలితాలు రావడంలేదు.

- నల్లారెడ్డి మధురెడ్డి, రైతు ముట్టెంబాక

లోకల్ బ్రోడర్లతో ఉత్పత్తి



కొన్ని హేచరీల యజమానులు నకిలి బ్రోడర్లతో పిల్లలు ఉత్పత్తి చేసి రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అలా ఉత్పత్తి చేసిన పిల్లలు చెరువులో పోసిన పది రోజులకే చనిపోతున్నాయి. నకిలీల నుంచి ఆక్వా రైతులను కాపాడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తరచూ తనిఖీలు చేస్తోంది. అయినా నకిలీలు తమ పంజా విసురుతూనే ఉంది.

- రమేష్, రైతు, రావిగుంటపాళెం

తనిఖీలు చేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా తమ శాఖ అధికారులు ఫీడ్ షాపులపై తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు షాపులపై దాడులు జరిపి అనుమతులు లేని మందులను సీజ్ చేయడం జరిగింది. అలాగే హేచరీలను తనిఖీ చేసి, నమూనాలను ఎంపెడా ల్యాబ్‌లకు పంపాం.

- ఎ.నాగరాజు, మత్స్యశాఖ జాయింటు డైరెక్టర్, తిరుపతి

ఎస్వీయూలో 'నీలిట్' ఏర్పాటుకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నీలిట్ సంస్థ ఏర్పాటుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. శుక్రవారం పరిపాలనా భవనం వీసీ ఛాంబర్‌లో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు అధ్యక్షతన ఎస్వీయూ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకమండలి సభ్యులు నేరుగా పాల్గొనగా, అమరావతి నుంచి ఉన్నత విద్యామండలి అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొని పలు అంశాలకు ఆమోద ముద్ర వేశారు. ఇందులో ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సంస్థను తిరుపతికి తీసువచ్చేందుకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి కేంద్రంతో పలుసార్లు సంప్రదించారు. దీంతో గత ఏడాది నీలిట్ సంస్థను ఎస్వీయూలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆమోదించింది. ఈ సంస్థను ఏర్పాటుకు పాలకమండలి సైతం నేడు ఆమోద ముద్రవేసింది. దీంతో పాటు మరో 8 అంశాలపై పాలకమండలి ఆమోదం తెలిపింది.

ఇందులో ప్రధానంగా..

- వర్సిటీలోని మైక్రోబయాలజీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.1.02 కోట్ల నిధుల విడుదలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది.
- ఫార్మసీ భవన నిర్మాణానికి రూ.2.08 కోట్లకు అనుమతి ఇచ్చారు.
- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్)ని వర్సిటీలో ఏర్పాటు చేయడానికి పాలకమండలి ఆమోదం లభించింది.
- వర్సిటీకి అనుబంధంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో విద్యార్థుల టాయిలెట్స్ కోసం రూ.76.80 లక్షల నిధులు మంజూరు.
- వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో టాయిలెట్ల కోసం రూ.85 లక్షల మంజూరుకు ఆమోదం తెలిపారు.
- ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రమోషన్ల కోసం పాలకమండలి సమ్మతి తెలిపింది.
- దూరవిద్య విభాగంలో స్టడీ మెటీరియల్‌కు ప్రింటింగ్ సంబంధించిన పెండింగ్ బిల్లులకు పాలకమండలి ఆమోదం లభించింది.
- ఎస్వీయూకు అనుబంధంగా ఉన్న మూడు టీటీడీ అనుబంధ కళాశాలలు, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలకు అటానమస్ సౌకర్యం కల్పించడానికి పాలకమండలి ఆమోదం తెలిపింది.
- దూరవిద్య విభాగం పేరును ఇక నుంచి 'సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ లెర్నింగ్'గా మారుస్తూ పాలకమండలి ఆమోదం తెలిపింది. దూరవిద్యలో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆన్‌లైన్ ద్వారా అందజేయనున్నారు. ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కే రామ్మోహన్‌రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పాలకమండలి సభ్యులు బి సుగుణమ్మ, డాక్టర్ సురేంద్ర నాథ్‌రెడ్డి, పద్మనాభం, కోలా మంజుల, డాక్టర్ మొద్దీన్‌బాషా, నారాయణ బాబు హాజరయ్యారు. వీరితో పాటు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, ప్రొఫెసర్ సుమకిరణ్ , ప్రభుత్వ ఆర్థిక శాఖ విభాగం నుంచి డిప్యూటీ సెక్రటరీ ఆదినారాయణ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు.

సంక్షేమ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కార్మిక శాఖ కమిషనర్ చిన్న లాలప్ప

తిరుపతి కల్చరల్: కార్మిక శాఖ అందిస్తున్న సంక్షేమ పథకాలను మెకానిక్‌లందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎస్.చిన్నలాలప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్ ఆవరణలో తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్‌తో పాటు కార్మిక శాఖ అధికారులు ఎం.రాజయ్య, ఎం.ప్రవీణ్‌కుమార్, జె.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ చిన్న లాలప్ప మాట్లాడుతూ ప్రతి మెకానిక్ కార్మిక శాఖలో తన పేరు రిజిస్ట్రేషన్ చేసుకుని, సభ్యత్వం నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇ-స్కీమ్ గుర్తింపు కార్డులు పొంది తద్వారా కార్మిక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి జలంధర్, కోశాధికారి గౌస్‌బాషా, సహాయ కార్యదర్శి గుర్నాథం ఆచారి, కమిటీ ఇన్‌చార్జ్ సోము, లక్ష్మణరావు, కేశవ, పాపయ్య, రాము, మెకానిక్ సభ్యులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ గిఫ్ట్‌గా ఇచ్చారు

- విద్యాశాఖామంత్రి లోకేష్ జోక్యంతోనే వేటు
- ఆర్డీఓకి వైఎస్సార్‌సీపీ ముద్ర వేసిన ఎమ్మెల్యే



నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ

తిరుపతి అర్బన్: 'శ్రీవేంకటేశ్వరస్వామి పాదల చెంత పనిచేసే అవకాశం వచ్చిందని ఎంతో సంతోషపడ్డాను. ఆ మేరకు తిరుపతిలో బాధ్యతలు స్వీకరించారు. ఆ భగవంతుడు పాదాల చెంత 11 నెలలుపాటు పనిచేసే భాగ్యం లభించింది. నేను ఏ తప్పూ చేయలేదు. అయితే తిరుపతికి వచ్చినందుకు నాకు సస్పెన్షన్ గిఫ్ట్‌గా ఇచ్చారు.' అని ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి ఆవేదన చెందారు. తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిని శుక్రవారం రాత్రి సస్పెండ్ చేశారు. పుత్తూరులో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి అవసరం అయిన ఎన్‌ఓసీ జారీ చేయడంలో అవినీతి చోటుచేసుకున్నట్లు ఆయనపై ఓ వ్యక్తి ఆరోపణలు చేశారు. ఈ అంశంపై గతంలో ఓ ఐఏఎస్ అధికారి విచారణ చేపట్టినప్పటికీ అందులో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి తప్పిదం లేదని రిపోర్ట్ ఇచ్చినట్లు చర్చ సాగింది. దీంతో ఆ ఘట్టం ముగిసిందని అంతా భావించారు. అయితే గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గం ఆర్వోగా నిషాంత్‌రెడ్డి పనిచేశారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినప్పటికీ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితోపాటు ఆ పార్టీకి చెందిన కొందరు ఆర్డీఓపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేశారని చర్చసాగింది. వైఎస్సార్‌సీపీకి అనుకూలం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం కూడా సాగించారు. ఈ క్రమంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొద్దిరోజుల్లోనే ఆయన్ని బదిలీ చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన విద్యాశాఖామంత్రి లోకేష్‌కు ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు వెంటనే విజయవాడ ఉన్నతాధికారులతో మాట్లాడి సస్పెండ్ చేయించారని అంతా భావిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో అనంతపురం నుంచి బదిలీపై వచ్చిన ఆయన తిరుపతి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టారు. 11 నెలలుపాటు తిరుపతి ఆర్డీఓగా పనిచేసిన ఆయన నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ పలు సమస్యలకు పరిష్కారం చూపించారు. అందర్నీ మనన్నలు పొందారు. అయితే టీడీపీ కూటమికి ఆయన గిట్టకపోవడంతోనే సస్పెన్షన్ వేటు పడిందని తెలుస్తోంది. ఆర్డీఓ బాధ్యతలు శుక్రవారం ఎవరికీ అప్పగించలేదు. శనివారం కొత్తవారికి ఇస్తారన్న చర్చసాగుతుంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయండి

-డిపో మేనేజర్లకు ఈడీ చెంగల్‌రెడ్డి ఆదేశాలు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వందశాతం కండిషన్‌లో ఉన్న బస్సు సర్వీసులను ఎంపిక చేయాలని కడప జోన్-4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి డీపీటీఓ(జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, మెకానిక్ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం కండిషన్‌లో ఉండే సర్వీసులను డిపోల వారీగా డీఎంల నుంచి స్వీకరించారు. 341 సర్వీసులు వంద శాతం కండిషన్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సర్వీసులను రోజుకు 2,700 ట్రిప్పులు తిప్పాలని ఆదేశించారు. అక్టోబర్ 9వ తేదీ గరుడోత్సవం రోజుతోపాటు 12వ తేదీ చక్రస్నానం శనివారం వస్తున్న నేపథ్యంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలు బ్రహ్మోత్సవాల్లో పూర్తి సహకారం అందించాలని సూచించారు. అవసరం అయితే ఎప్పటిలాగానే బ్రహ్మోత్సవాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులను తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ప్రతి డిపో నుంచి బ్రహ్మోత్సవాలకు బస్సులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గత బ్రహ్మోత్సవాల్లో చోటుచేసుకున్న చిన్న చిన్న పొరబాట్లును సరిదిద్దుకుని ముందుకు సాగాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

2.7 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్టు

తిరుపతి క్రైమ్: అక్రమంగా విక్రయిస్తున్న 2.7 కిలోల గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపారు. జీవకోనలో గంజాయి అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమదైన శైలిలో దాడులు చేసి శ్రీకాకుళంలో నివాసముంటున్న హరిబాబు, జీవకోనకు చెందిన ముత్తుకూరు గోపీచంద్, వేదాల ఇశ్రాయేలు, చెందుతోపాటు మరో బాల నేరస్తుడిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 2.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



కమిలిపోయిన విద్యార్థి వీపు

భాకరాపేట : హోమ్ వర్క్ చేయలేదని విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రావారిపాళెం మండలం చింతగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నాలుగో తరగతి విద్యార్థి సాద్విక్‌ను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్‌నాయుడు ఇంటి వద్ద హోమ్ వర్క్ చేయక పోవడంతో నోటుబుక్ కూడా తీసుకురాలేదని చితకబాదారు. దీంతో విద్యార్థి వీపు మీద వాతలు పడ్డాయి. ఈ విషయమై ఎంఈఓ బాలసుబ్రమణ్యాన్ని వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే పాఠశాలకు వెళ్లి విచారించానన్నారు. విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి విచారించగా తమ బిడ్డ ఇంటి వద్ద హోమ్ వర్క్ చేయడం లేదని తెలిపారని చెప్పారు. ఉపాధ్యాయుడు కొట్టడంపై డీఈఓకు నివేదిక పంపుతున్నట్లు చెప్పారు.